
బీఆర్ఎస్ రజతోత్సవాలను పురస్కరించుకుని 2001 నాటి నల్లబెల్లి జెడ్పీటీసీ ఎన్నికల బ్యానర్‌ను పునరావిష్కరిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు రాజయ్య, ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా తదితరులు

# విజయ పతాక యాదిలో..

- నాటి ఎన్నికల ప్రచార జెండాను దాచిన మాజీ ఎమ్మెల్యే పెద్ది
- ఆనాటి జెండాను పునరావిష్కరించిన పార్టీ అధినేత కేసీఆర్
- ఉద్యమ రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న నేతలు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) ఆవిర్భావ రజతోత్సవ సంరంభానికి అడుగుపెడుతున్న అపురూప సందర్భమిది. ఈ అద్భుత ఘట్టాన్ని అంబరాన్నంటేలా నిర్వహించాలని గులాబీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. తెలంగాణ సాధనే లక్ష్యంగా ఉద్యమసారథి కేసీఆర్ దార్శనికతతో ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన (ఏప్రిల్ 27, 2001లో) తొలినాళ్లలోనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసింది. 2001 జూలైలో వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో ప్రజ్వరిల్లింది. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తెలంగాణ వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గులాబీ రంగు జెండాపై రైతు నాగలి గుర్తుతో పోటీ చేసి 85 మంది జెడ్పీటీసీలు, వందలాది మంది ఎంపీటీసీలు విజయకేతనం ఎగురవేశారు. కరీంనగర్, నిజామాబాద్ రెండు జిల్లా ప్రజాపరిషత్‌లపై గులాబీ జెండా సగర్వంగా ఎగిరింది. ఆ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని నల్లబెల్లి మండల జెడ్పీటీసీగా పెద్ది సుదర్శన్‌రెడ్డి విజయం సాధించారు. ఆ సందర్భంలో క్లాత్ మీద బ్రష్‌తో రాయించిన ఎన్నికల ప్రచార బ్యానర్‌ను, పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో సోమవారం అధినేత కేసీఆర్‌తో పునరావిష్కరణ చేయించారు. ఆనాటి పార్లమెంటరీ ఉద్యమపంథా పోరాట జ్ఞాపకాలను పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా ఇతర నేతలు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ప్రచార బ్యానర్‌ను భద్రపరిచి ఉద్యమ సందర్భాన్ని మరోసారి స్మరించుకునేలా చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి బృందాన్ని అధినేత కేసీఆర్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు డాక్టర్ రాజయ్య, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

# జిల్లాల పర్యటనకు కేటీఆర్

**20న సూర్యాపేట, 23న కరీంనగర్‌లో ముఖ్య కార్యకర్తలతో సన్నాహక భేటీలు**

**అసెంబ్లీ సమావేశాల తర్వాత పర్యటన.. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సంబురాలపై నిర్దేశం**

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ సిల్వర్‌జూబ్లీ సంబురాలను సమాయత్తమవుతున్నది. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నది. సంబురాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నెల 20న సూర్యాపేట జిల్లా కార్యకర్తలతో, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో సమావేశం కానున్నారు. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణభవన్‌లో సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వరంగల్ లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనునట్టు పార్టీ ఇప్పటికే ప్రకటించింది.

**పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం**

బడ్జెట్ సమావేశాల అనంతరం కేటీఆర్ అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. 14 ఏండ్ల ఉద్యమం ప్రస్థానం, పదేండ్ల ప్రగతి ప్రస్థానంలో తెలంగాణ సమాజంతో బీఆర్ఎస్ పార్టీ పెనువేసుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సమావేశాల సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోనున్నారు. ఎన్ని రకాల ఒడిదుడుకులు ఎదురైనా గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు రానున్న రోజుల్లో మళ్లీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేటీఆర్ భరోసా ఇవ్వనున్నారు.

# భద్రాద్రి ఆలయం అభివృద్ధికి నిధులివ్వండి

రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్



హైదరాబాద్, మార్చి17 (నమస్తే తెలంగాణ): భద్రాచలం ఆలయ అభివృద్ధికి నిధులివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాద్రిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మోదీ సర్కారుపై ఉన్నదని స్పష్టం చేశారు. అందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సరికాదని పేర్కొన్నారు. రైల్వేలైన్ ఏర్పాటు చేయకపోవడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఆలయ ప్రాశస్త్యాన్ని గుర్తించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఏటా లక్షల మంది సందర్శించే ఆలయాభివృద్ధి కోసం ఇప్పటికైనా నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

# భక్తుల ఇంటికే భద్రాద్రి రాముడి తలంబ్రాలు

తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎండీ సజ్జనార్

హైదరాబాద్, మార్చి17 (నమస్తే తెలంగాణ): కోరుకున్న భక్తుల ఇంటికి భద్రాద్రి రాముడి తలంబ్రాలు చేరవేయాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. తలంబ్రాలు కావాల్సిన భక్తులు ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్లు లేదా tgsrtclogistics.co.ina ద్వారా రూ. 151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని సూచించింది. ఈ మేరకు సోమవారం బస్‌భవన్‌లో తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆవిష్కరించారు. వివరాలకు 040-69440069, 040-69440000 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సీవోవో డాక్టర్ రవీందర్, ఈడీ మునిశేఖర్, సీటీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ప్రశ్నిస్తే జైలుకా?

- ప్రజల అసహనాన్ని చూపిస్తున్నందుకే అక్రమ కేసులు
- మాపై అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డికి మా కుటుంబాలు గుర్తుకురాలేదా?
- తెలంగాణ రైజింగ్ కాదు ఫాలింగ్
- చంచల్‌గూడలో రేవతి, తన్వీని పరామర్శించిన కేటీఆర్



చంచల్‌గూడ జైలు వద్ద మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి తదితరులు

మలక్‌పేట, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైలుకు పంపించడమే ఇందిరమ్మ రాజ్యమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్‌ను సోమవారం మధ్యాహ్నం పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రజలంతా అదేదో సంక్షేమరాజ్యం అని భ్రమపడ్డారని, కానీ, ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెచ్చేలా ఉన్నదని ఎద్దేవా చేశారు. ప్రజల మాటలను చూపిస్తే కేసులెలా పెడతారని ప్రశ్నించారు. జనం నిలదీస్తే, ఇదేమిటని ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపుతారా? అక్రమకేసులు పెట్టి జైలుకు పంపుతారా? అని మండిపడ్డారు. పదుల సంఖ్యలో జర్నలిస్టులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమకేసులు, దాడులతో వేధిస్తున్నదని ఆరోపించారు.

**పాలనలో విఫలమైనట్టు ఒప్పుకున్న సీఎం**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని రేవంత్‌రెడ్డే ఒప్పుకున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రూ.71 వేల కోట్ల ఆదాయం తగ్గిందని స్టేషన్‌ఘన్‌పూర్‌లో చెప్పారని, ఇందుకు రేవంత్ అసమర్థ విధానాలే కారణమని విమర్శించారు. తెలంగాణ రైజింగ్ కాదని, తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అని స్వయంగా ముఖ్యమంత్రి కన్ఫర్మ్ చేశారని ఎద్దేవా చేశారు. ఇకనైనా మీడియా గొంతు విప్పి రేవంత్‌రెడ్డి అక్రమాలపై మాట్లాడాలని సూచించారు. ప్రజాస్వామిక స్ఫూర్తిని కాపాడే విధంగా రాహుల్‌గాంధీకి, ఆయన పార్టీకి ప్రజాస్వామ్య లక్షణాలను మళ్లీ గుర్తు చేసే విధంగా మీడియా పాటుపడాలని కోరారు.

**అక్రమ కేసులు పెట్టడమే ఏడో గ్యారెంటీ అమలా?**

'ప్రజలపై అక్రమ కేసులు పెట్టి వేధించమే ఏడో గ్యారెంటీనా? ప్రజలు గొంతు విప్పితే తట్టుకోలేకపోవడమే ఏడో గ్యారెంటీనా? తన భార్యాపిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న రేవంత్ గతంలో మాపై అవాకులు, చెవాకులు పేలిన సంగతి మర్చిపోయారా? మా పిల్లల ప్రస్తావన తెచ్చినప్పుడు రేవంత్‌కు తన కుటుంబం గుర్తుకు రాలేదా? నువ్వు మాట్లాడితే మంచిది, ఇంకొకరు మాట్లాడితే చెడ్డదా? రేవంత్ ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలి' అని కేటీఆర్ మండిపడ్డారు. తాము కేసులు, బెదిరింపులకు భయపడే వాళ్లం కాదని, రేవతి, తన్వీ యాదవ్ తరపున న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

**ప్రభుత్వ అసహనాన్ని కప్పిపుచ్చుకోవడానికి అరెస్టులు: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

చేయని తప్పుకు శిక్ష అనుభవించాల్సి వస్తున్నదని రేవతి, తన్వీయాదవ్ అంటుంటే చాలా బాధగా అనిపించిందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రుణమాఫీ కాలేదని అడగితే విజయరెడ్డి, సరితయాదవ్‌పై కేసు పెట్టి వేధించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో 11 మంది మీద అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా జర్నలిస్టులను అరెస్టు చేస్తూ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టగారు.

**అరెస్టులు అమానుషం: సునీతాలక్ష్మారెడ్డి**

రేవతి, తన్వీయాదవ్ అరెస్టు దారుణం, అమానుషమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలనలో ప్రజల హక్కులను హరించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలపై ఈ అరాచకాలు ఏమిటని ప్రశ్నించారు. తెల్లవారుజామున రేవతి, తన్విని అరెస్ట్ చేసిన తీరు ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు ఆజం అలీ, చెల్లూరి రఘునందన్‌రెడ్డి, తేళ్ల మహేశ్‌కుమార్, భూమేశ్, నాగరాజు, సామ సుందర్‌రెడ్డి, రామ్‌నరసింహ, పగిళ్ల నర్సింగ్, బాబు సుదర్శన్, యాదగిరి పాల్గొన్నారు.

## మహిళా జర్నలిస్టులకు బెయిల్ మంజూరు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 17 (నమస్తే తెలంగాణ): యూట్యూబ్ చానల్ పల్స్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ పీ రేవతి, రిపోర్టర్ బండి సంధ్య అలియాస్ తన్వీ యాదవ్‌కు 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జీ అనూష షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఇద్దరినీ ఐదురోజుల కస్టడీకి అప్పగించాలన్న సైబర్ క్రైమ్ అధికారుల పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఓ రైతు చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసినందుకు పోలీసులు వీరిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో వారిపై ఆర్గనైజేషన్ సెక్షన్ 111ను చేర్చినా కోర్టు పరిగణించ లేదు. పోలీసు కస్టడీ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో న్యాయం గెలిచిందని న్యాయవాదులు లక్ష్మణ్, లలితారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రూ.25 వేల చొప్పున ఇద్దరి జమానత్‌లను కోర్టుకు సమర్పించాలని, పాస్‌పోర్టులను స్వాధీనం చేయాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో ఆదేశించింది. తన్వీ యాదవ్‌కు పాస్‌పోర్ట్ లేకపోవడంతో ఆమె తరపున న్యాయవాదులు జక్కుల లక్ష్మణ్, లలితారెడ్డి అఫిడవిట్‌ను దాఖలు చేయనున్నారు. జైలు అధికారులకు కోర్టు ఉత్తర్వులు అందిన వెంటనే మంగళవారం సాయంత్రం విడుదల చేయనున్నారు. సైబర్ క్రైమ్ ఎస్‌హెచ్‌వో, విచారణాధికారి ఎస్ నరేశ్ కోర్టు జారీ చేసిన షోకాజ్ నోటీసులకు వివరణ సమర్పించారు. సెక్షన్ 111 వర్తింపు గురించి, మహిళా జర్నలిస్టుల అరెస్టు సమాచారాన్ని ఎవరికి అందించారో సమయంతో సహా తెలియజేయాలని ఆదేశించడంతో అందుకు బదులిచ్చారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

# కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

**జగదీశ్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు: తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి**


సూర్యాపేట, మార్చి 17 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో స్పీకర్‌ను అవమానించినట్టుగా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. పదే పదే దళిత స్పీకర్ అంటూ వారే స్పీకర్‌ను అవమానిస్తున్నారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం సూర్యాపేట బీఆర్ఎస్ కార్యాలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో జగదీశ్‌రెడ్డి మాటలు వైరల్ అవుతున్నాయని, ఎక్కడా స్పీకర్‌ను కించపర్చేలా మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో ఉంటే ప్రభుత్వం ఆటలు సాగడం లేదని, అందుకే సస్పెండ్ చేశారని అన్నారు. ఈ నెల 20న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని లింగయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

# ఇంకెన్నాళ్లీ నియంతృత్వ పాలన

- ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..?
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకుల ధ్వజం
- ఉమ్మడి కరీంనగర్‌లో కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం


కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తే నెట్‌వర్క్, మార్చి 17: అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాటవేత చర్యగా సస్పెన్షన్ చేయడం దుర్మార్గమని, ఇంకెన్నాళ్లీ నియంతృత్వ పాలన అని బీఆర్ఎస్ నాయకులు ఫైర్ అయ్యారు. సస్పెన్షన్‌పై కేటీఆర్, జగదీశ్‌రెడ్డి నిరసన తెలిపితే కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం దారుణమని మండిపడ్డారు. దిష్టిబొమ్మల దహనానికి నిరసనగా సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గవర్నర్‌తో అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలాడించి, వాటిని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక ప్రజల ఆలోచనను డైవర్ట్ చేసేందుకు సస్పెన్షన్‌లకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేసేదాకా ప్రజలతో కలిసి పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. రామడుగులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రోడ్డుపై ధర్నా చేశారు. చొప్పదండిలోని తెలంగాణ చౌరస్తాలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కలిసి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. అనంతరం నాయకులను అరెస్టు చేసి చొప్పదండి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని అరెస్టు అయిన నాయకులను విడిపించారు.


గోదావరిఖని-పెద్దపల్లి రహదారిపై సాగుతున్న మహాపాదయాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి, తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు రవీందర్ తదితరులు

# 'గోదావరి తల్లి కన్నీటి గోస'

**మహాపాదయాత్రను ప్రారంభించిన కొప్పుల, పుట్ట, నడిపల్లి**

**మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు**

పెద్దపల్లి, మార్చి 17(నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతుల కన్నీళ్లను తుడిచేందుకు 'గోదావరి తల్లి కన్నీటి గోస' మహాపాదయాత్ర పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సోమవారం ప్రారంభమైంది. గోదావరి వద్ద నుంచి ఎర్రవల్లి వరకు సాగే 180 కిలోమీటర్ల పాదయాత్రను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, నడిపల్లి దివాకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో గోదావరి తీరంలోని శివుడు, సమ్మక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి పాదం కదిపారు. రామగుండం క్రాస్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ప్రతి కూడలి వద్ద పాదయాత్ర బృందానికి మహిళలు మంగళహారతులు పడుతూ స్వాగతం పలికారు. 'గోదావరి తల్లి కన్నీటి గోస' మహాపాదయాత్రతో కాంగ్రెస్‌కు కనువిప్పు కలుగుతుందని కొప్పుల పేర్కొన్నారు.


This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

**Format C-1**

(for candidate to publish in Newspapers, TV)

**Declaration about criminal cases**

(As per the judgment date 25th September, 2018, of the Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **Dr. DASOJU SRAVAN KUMAR, Flat No. 906, Aditya Empress Heights, Shaikpet nala, Shaikpet, VTC Golconda, HYDERABAD-500008. TELANGANA.**

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI**

(Independent candidates should write " Independent " here)

Name of Election : **BIENNIAL ELECTION TO TELANGANA LEGISLATIVE COUNCIL-2025.**

*Name of Constituency : **BY THE MEMBERS OF LEGISLATIVE ASSEMBLY(MLAs)**

I **Dr. DASOJU SRAVAN KUMAR** (name of candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A)pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No and dated | Status of cases(S) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1. | XVth ACMM Crimnal Court Complex at Nampally CC.No.10404 of 2023 | FIR NO. 304 of 2023 at Shainayath gunj Police Station | Pending | Sec.188 of IPC This is a Suo Motu Police case alleging that I was found along with the contesting candidate on 29th November 2023 at about 19.00 Hours at Sriram Colony, Begum Bazar, Hyderbad in violation of Model Code of Conduct during General Eelections-2023, Telangana. |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(S) of order(s) | Description of offence (s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| -- | -NA- | -NA- | -NA- |

*in the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.